క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో వెలసిన శ్రీమహాజ్వాలా సుదర్శన లక్ష్మీనరసింహ ధర్మ పీఠం ఆలయంలో అహోబిలం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి గురువారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమన శాస్త్రం ప్రకారం వేదమంత్రోచ్చారణల మధ్య సకల దేవతల ఆశీర్వచనాలతో ఉభయదేవేరులైన శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణం జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఆళ్లగడ్డ: పట్టణంలోని రామలక్ష్మీ కొట్టాల కాలనీలోని అగ్ని ప్రమాద బాధితులకు విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. నాలుగు రోజుల క్రితం కాలనీలో ప్రమాదవశాత్తు ఆరు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాలను కలిసి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున అందజేశారు.

పచ్చదనం పెంపొందించండి


రుద్రవరం అటవీ కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటిన అధికారులు, సిబ్బంది

రుద్రవరం: మానవ మనుగడలో అడవుల పాత్ర ఎంతో ఉందని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతి నాయుడు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గురువారం సిబ్బందితో కలిసి స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ అడవుల వల్ల వాతావరణ సమతుల్యత ఏర్పడి మంచిగా వర్షాలు కురిసేందుకు దోహదపడతాయని చెప్పారు.అలాగే పచ్చదనం పెంపొందించడం వల్ల వాతావరణం కలుషితం కాదన్నారు. ఎఫ్ఎస్ఓ నాగరాజు,ఎఫ్‌బీఓలు రామకృష్ణ, నాగేంద్రయ్య, మాబుఖాన్, నరసింహారెడ్డి, సురేంద్ర గౌడ్ ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం, మెరుగైన సేవలు అందించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో సెల్ 9959225800 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలు సంపాదించాలని రైల్వే సూపరింటెండెంట్ వి.దొరస్వామి, శ్రీరామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో రాష్ట్ర స్థాయి వాణిజ్య విభాగంపై సెమినార్ నిర్వహించగా 8 కళాశాలల విద్యార్థులుపాల్గొన్నారు. అనంతరం వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నంద్యాలకు మెరుగులు


నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద రంగులు వేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఇప్పటికే అన్ని వార్డుల్లో మౌలిక వసతులకు సమకూర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసింది. అలాగే పట్టణ సుందరీకరణకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పలు ప్రధాన రహదారుల్లోని డివైడర్లలో మొక్కలు నాటించి, డివైడర్లకు ఇంపైన రంగులు వేయిస్తోంది. స్థానిక పురపాలక కార్యాలయం నుంచి బస్టాండు వరకు డివైడర్లకు వేసిన రంగులు చూపరులకు కొత్త అనుభూతిని పంచుతున్నాయి.

కవికి సత్కారం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యూవేషన్ కార్యాలయంలో కవితా దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన రచయిత, కొప్పుల ప్రసాద్‌ను తెలుగు శాఖ అధ్యాపకులు గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నరేంద్ర, అధ్యాపకులు సూర్యనారాయణ, బాల ఒబన్న, సుజాత పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

- ఈనెల 23 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు
- గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు
- జిల్లాలో 24,948 మందికి లబ్ధి
- బలవర్ధక ఆహారంతో లబ్ధిదారుల్లో పెరుగుతున్న హెచ్‌బీ శాతం


గోస్పాడులో బాలింతలు, గర్భిణులకు గుడ్లు అందజేస్తున్న దృశ్యం


బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోస్పాడు: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. పలు రకాల పోషకాహార పదార్థాలతో సంపూర్ణ పోషణ కిట్లను వారికి అందిస్తోంది. పోషకాహార ఫలితాల గురించి వివరించేందుకు, విధానాలను మెరుగు పరిచేందుకు ఏటా మార్చి 9 నుంచి 23వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రాముఖ్యతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ..

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు బియ్యం 3 కిలోలు, కందిపప్పు కేజీ, వంటనూనె అరలీటర్, కోడిగుడ్లు 25, పాలు 5 లీటర్లు, రాగి పిండి 2 కిలోలు, కేజీ అటుకులు, బెల్లం, చిక్కీ, ఖర్జూరాలు పావు కిలో చొప్పున ప్రతి నెలా అందజేస్తున్నారు. పిల్లలకు బాలామృతం రెండున్నర కిలోలు, కోడిగుడ్లు 25, పాలు రెండున్నర లీటర్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా బాలింతలు 12,538, గర్భిణులు 12,410 మంది ఉన్నారు. వీరికి నెలనెలా వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు 60,406 మంది బాలలు ఉండగా 3 నుంచి ఆరేళ్ల పిల్లలు 40,577మంది ఉన్నారు.

పక్షోత్సవాలు ఇలా..

పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తూ గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యం, చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన, చేతులు కడగటం వలన కలిగే లాభాలు, పోషకాహార లోపంపై అవగాహన కార్యక్రమాలు, ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్) పై వివరించటం, ఖేల్ ఔర్ పతో ఈవెంట్ ఏర్పాటు, వంటల పోటీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన, రక్తహీనత గర్భిణుల గుర్తింపు, గర్భిణులకు నిరంతర చెకప్‌లపై అవగాహన, ప్రీ స్కూల్ తల్లిదండ్రుల ప్రమేయం వివరించటం, ఆరోగ్య పరీక్ష శిబిరాలు, నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ, స్వచ్ఛత దినోత్సవం, బొమ్మల తయారీ. యోగాపై గర్భిణులకు అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలు బాగున్నాయి



అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు బాగున్నాయి. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కింద ప్రతి నెలా కిట్లు ఇస్తున్నారు. ఈ సరుకులు ఎంతో పోషక విలువలతో కూడుకున్నాయి. అన్ని విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నారు. వైద్యులతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు.

–మహేశ్వరి, గర్భిణి, పసురపాడు

పౌష్టికాహారంతో బలహీనత తగ్గుతుంది



సంపూర్ణ పోషణ కింద ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం కిట్టు ఎంతగానో ఉపయోగపడుతుంది. రక్తహీనతను నివారించే ఆహారం ఇస్తుండడం ఆనందంగా ఉంది. రాగి పిండి, ఖర్జూరాల, చెక్కీలు, పాలు, గుడ్లు తీసుకోవడం వల్ల మాలో బలహీనత తగ్గి రక్తశాతము వృద్ధి చెందుతుంది. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ఆహారం తీసుకోవాలని, మందులు వేసుకోవాలో వివరిస్తున్నారు.

–శిరీష, బాలింత, గోస్పాడు

అందరూ సంతోషంగా ఉండాలి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి

బొమ్మలసత్రం: అల్లాహ్ దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 14 వ వార్డులోని 14 మసీదుల్లో గురువారం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయనను ముస్లిం మత పెద్దలు ఆహ్వానించగా ప్రార్థనలో పాల్గొన్నారు.

మహానందీశ్వర దంపతులకు ఏకాంతసేవ పూజలు

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి దంపతులకు గురువారం రాత్రి ఏకాంత సేవ పూజలు నిర్వహించారు. స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా ఏకాంత సేవ పూజలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈకై ంకర్యం జరిపిస్తున్నారు. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.


మహదేవపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఓట్లడిగే అర్హత వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉంది

శిరివెళ్ల: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో మునుపెన్నడూ లేనంత సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందాయి. ఈ ఎన్నికలలో ఓట్లడిగే అర్హత తమకే ఉందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహదేవపురంలో భార్య గంగుల సారికారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులకు స్థానిక నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో మహదేవపురంలో రూ.1.50 కోట్లతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. నవరత్నాలు పేరిట గ్రామంలో అర్హులకు రూ.16.50 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితే మరిన్ని పథకాలు, అభివృద్ధి చేసుకోవడానికి వీలవుతుందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. గంగుల విజయసింహారెడ్డి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు నరహరి, సర్పంచు పెద్ది రమణయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, మండల కోశాధికారి వంకదార సుబ్బసత్యనారాయణ శ్రేష్ఠి, దేవస్థానం మాజీ చైర్మన్ జయమ్మ, సర్పంచులు జింకల నాగన్న, మందాల శివారెడ్డి,నాయకులు వెంకటస్వామి, రాజేశం గౌడ్, శిరిగిరి శంకర్, మద్దిలేటి, ఈశ్వరయ్య, రమేష్, గాలి అబ్రహం,నాగరాజు, బంగారయ్య, రత్నమయ్య పాల్గొన్నారు.

మహానందిలో రేపు పదహారు రోజుల పండుగ


అంకురాలకు ఏపుగా మొలకలు పండిన దృశ్యం

మహానంది: మహానందిలో ఈ నెల 23న పదహారు రోజుల పండుగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కల్యాణోత్సవ దీక్షా విసర్జన, అంకుర విసర్జన, రథాంగ దేవతల ఉద్వాసన కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొని శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి అనుగ్రహం పొందాలని కోరారు. ఈ ఏడాది నవధాన్యాల అంకురాలకు మొలకలు బాగా వచ్చాయని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు


ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు గురువారం ఎంతో రసవత్తరంగా సాగాయి. పోటీలను గ్రామ సర్పంచ్ నవీన్, గ్రామ కమిటీ పెద్దలు ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వడ్డె రంగస్వామి, సాలె షాలన్న, సీపీఎం రాజు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

కొణిదేల గ్రామంలో శుక్రవారం సాయంత్రం భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సాలె కిరణ్ తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


పోలూరు సచివాలయంలో డిస్‌ప్లే బోర్డుకు ముసుగు కప్పుతున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. మండలంలోని పులిమద్ది, రాయమాల్పురం, మునగాల, పోలూరు గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ఎంపీడీఓ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, పోస్టర్లు, స్టిక్కర్లు లేకుండా చేశామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు.పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


ముత్యాలపాడు బస్టాండు సెంటర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ రఘువీర్

చాగలమర్రి: ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ ట్రైనీ డీఎస్పీ రఘువీర్, ఎస్ఐ రమణ్య తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పారా మిలటరీ, బీఎస్ఎఫ్ దళాలతో గురువారం గ్రామంలో చిన్నమకానం, ముత్యాలపాడు బస్టాండు, మొయిన్‌బజార్, పెద్దమకానం, కోటగడ్డ, మల్లెవేముల సెంటర్, పాత బస్టాండ్, ముత్యాలపాడు, గొడిగనూరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ముత్యాలపాడు బస్టాండు సమీపంలో గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల అమలు సహకరించాలని కోరారు. స్వేచ్ఛాయుతంగా ఓటు వినియోగించుకోవాలని చెప్పారు. ఏఎస్ఐ అబ్దుల్ నబి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 15వ వార్డు యువకులు, ఎస్‌బీఐ కాలనీకి చెందిన రజకులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 15వ వార్డుకు చెందిన దాదాపు వంద మంది యువకులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ నాయకులు దాల్‌మిల్ అమీర్, సాయిరాంరెడ్డి, దాదా, కత్తి ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శిల్పా మోహన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పట్టణంలో నిర్వహించే మేమంతా సిద్ధం సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనాథ్, అక్రమ్, వినోద్, ఖాజా, సుధీర్, నాని, సయాబ్, ఇర్ఫాన్, పవన్, గణేష్ ఉన్నారు. అలాగే.. ఎస్‌బీఐ కాలనీకి చెందిన 50 రజక సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వెంకటరమణ, ఎల్లయ్య, వెంకటరాముడు, సుబ్బరాయుడు, రాముడు, నాగరాజు, వెంకటేశ్వర్లు, రంగన్న, శ్రీనివాసులు, వెంకటరమణ, చిట్టిబాబు, దిబ్బన్నను శిల్పా మోహన్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దొర్నిపాడు: మండల కేంద్రంతో పాటు క్రిష్టిపాడు, చాకరాజువేముల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో వసతులపై బీఎల్‌ఓలతో ఆరాతీశారు. విద్యుత్, వెంటిలేషన్, మరుగుదొడ్లు, నీటి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం ర్యాంప్‌ల ఏర్పాటుపై ప్రశ్నించారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డులు, సీఎం, ప్రారంభోత్సవ శిలాఫలకాలకు ముసుగులు వేశారా లేదా అని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సాంబశివుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, బీఎల్‌ఓ ఉశేనమ్మ ఉన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాల పరిశీలన

వెలుగోడు: మండల పరిధిలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు పరిశీలించారు. గురువారం మండలంలోని రేగడగూడూరు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, మార్క్‌ఫెడ్ జీఎం ఆదినారాయణ, మార్కెట్ డీఎం నాగరాజు, వెలుగోడు ఏఓ పవన్ కుమార్‌లతో కలిసి సందర్శించారు. రబీలో సాగుచేసిన జొన్న పంటను ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటా రూ.3180 చొప్పున కొనుగోలు చేస్తోంది. రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల దిగుబడులను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు మోహన్‌రావు తెలిపారు. ఇప్పటికే నందాల జిల్లాలో 1,218 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 1,573 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

హరినాథ్ సీడ్ కంపెనీకి నోటీసులు


డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): అయ్యలూరు మెట్ట సమీపంలోని హరినాథ్ క్రాఫ్ జనటిక్స్ సీడ్ ప్రాసెసింగ్ కంపెనీకి పొల్యూషన్ బోర్డు అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. విత్తన ప్రాసెసింగ్‌లో వచ్చే కెమికల్ వాటర్‌ను సమీపంలోని పొలాల్లో డంపింగ్ చేస్తున్నారనే ఫిర్యాదుతో కాలుష్య బోర్డు అధికారులు మునిప్రసాద్, గణేష్ తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించారు. వారు మాట్లాడుతూ కంపెనీ నుంచి విడుదలైన రసాయన నీటితో పొలం భూసారం క్షీణించి పోతుందని ఫిర్యాదులు అందడంతో తనిఖీ చేపట్టామని తెలిపారు.

వేగంగా వంతెన నిర్మాణ పనులు


వక్కిలేరు వాగుపై సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు–శిరివెళ్ల గ్రామాల మధ్య వక్కిలేరు వాగుపై వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఆ గ్రామస్తులు శిరివెళ్ల వైపు వెళ్లాలంటే వాగు దాటలేక అవస్థలు పడేవారు. వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు గత ప్రభుత్వాలకు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నారు. అయినా నాటి ప్రజాప్రతినిధులు కరుణించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ముందుగా శిరివెళ్ల నుంచి పేరూరు,ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు మీదుగా చందలూరు వరకు దాదాపు రూ.8కోట్లతో తారు రోడ్డు వేయించారు. అలాగే పేరూరు–శిరివెళ్ల మధ్య వక్కిలేరు వాగుపై వంతెన నిర్మాణానికి దాదాపు రు.9కోట్లు మంజూరు చేయించి గత నెల 20న భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. నాటి నుంచి కాంట్రాక్టరు పనులను వేగంగా సాగిస్తున్నారు. త్వరలో వంతెన నిర్మాణం పూర్తయితే తమ సమస్య తీరుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో నూతనంగా గంగమ్మ ఆలయం నిర్మించారు. ఆలయంలో గంగమ్మ అమ్మవారితో పాటు పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వేద పండితులు మొదటిరోజు గణపతి పూజతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం విగ్రహాలకు గ్రామోత్సవం జరిపించారు. పూజా కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొనొద్దు

దొర్నిపాడు: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో గ్రామ వలంటీర్లు పాల్గొంటే వెంటనే విధుల నుంచి తొలగిస్తామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అలాగే సచివాలయ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొన్నా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డౌన్ సిండ్రోమ్‌ను సకాలంలో గుర్తించాలి


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: చిన్నారుల్లో డౌన్ సిండ్రోమ్‌ను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే వారికి మంచి భవిష్యత్ అందించవచ్చని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డైక్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, పిడియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ అరుణ్ జ్యోతి మాట్లాడుతూ శబ్దాలకు, వెలుతురుకు, పాటలు తదితరులకు చిన్నారుల ప్రతిస్పందన సరిగా లేకపోతే తల్లిదండ్రులు డైక్ కేంద్రం నందు సంప్రదించాలని సూచించారు.

సమాజానికి మేలు చేసేదే కవిత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పాణ్యం: సమాజం మేలు కోరేది కవిత్వమని, ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని చైర్మన్ శాంతిరాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థితి, గతిని మార్చే శక్తి కవిత్వానికి ఉందన్నారు. చింతామణి నాటకం లేకుంటే వేశ్యవృత్తి ఇంకా కొనసాగేదన్నారు. గుర్రం జాషువా, కృష్ణశాస్త్రి, సత్యనారాయణ, విశ్వనాథం వంటి వారు కవిత్వం ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చారని వివరించారు. అనంతరం కవితా సంపుటిలను ఆవిష్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శిరివెళ్ల: ఆత్మహత్యకు యత్నించిన వెలుగోటి నాగేశ్వరరెడ్డి (30) కర్నూల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరుకు చెందిన సుబ్బారెడ్డి, అతని కుమారుడు నాగేశ్వరరెడ్డి అప్పుల బాధ తట్టుకోలేక ఈ నెల 17న శిరివెళ్ల మెట్ట వద్దకు వచ్చి గడ్డి నివారణ మందు తాగి అపస్మాకర స్థితిలో పడిపోగా బాటసారులు 108కు సమాచారమిచ్చారు. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో ఉన్నత చికిత్స నిమిత్తం కర్నూల్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.